ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024

నలుగురు వలంటీర్లపై చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్ : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎస్.కోట, గరివిడి మండలాలకు చెందిన నలుగురు వలంటీర్లను తొలగించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరివిడి మండలం చుక్కవలస గ్రామానికి చెందిన వలంటీర్లు కిల్లాన ప్రసాద్, రేవళ్ళ త్రినాథ్‌లు ఎన్నికలు ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో వారిని తొలగించామని తెలిపారు. అలాగే ఎస్.కోట మండలంలోని అలుగుబిల్లిలో వలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మనోజ్‌కు మార్‌లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో విచారించి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.





గీత దాటితే వేటే

- నలుగురు వలంటీర్ల తొలగింపు
- వైసీపీ తరపున ప్రచారం చేసినందుకు..
- కొరడా ఝుళిపించిన ఎన్నికల సంఘం
- అయినా తీరు మారని వైనం
- వైసీపీ నేతలూ నిబంధనలు అతిక్రమించి ప్రచారం
- రేగిడి ఎంపీడీవో ఫిర్యాదు.. ముగ్గురిపై కేసు నమోదు
- విజయనగరం వైసీపీ మీటింగ్‌లో నలుగురు వలంటీర్లు
- ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు
- కొన్నిచోట్ల డీలర్లూ అంటకాగుతున్న వైనం



అలుగుబిల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు

శృంగవరపుకోట రూరల్, మార్చి 21: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం కొరడా ఝులిపిస్తోంది. గీత దాటితే వేటే అని హెచ్చరించడమే కాదు అన్నంత పనీ చేస్తోంది. అయినా అధికార పార్టీ నేతలు, వలంటీర్లు పదేపదే కోడ్‌ను అతిక్రమిస్తున్నారు. పర్యవసానం ఎదుర్కొంటున్నారు. తాజాగా ఒకేరోజు గురువారం నలుగురు వలంటీర్లను కలెక్టర్ తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ ఇదే రోజు విజయనగరంలోని ఓ ఎన్నికల ప్రచార సభలో నలుగురు వలంటీర్లు పాల్గొన్నారు. కాగా ఎన్నికల ప్రచార ర్యాలీకి అనుమతి తీసుకోని కారణంగా రేగిడి మండలంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి, మరో నేతపై పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు చేశారు.

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్న వలంటీర్లను తొలగిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఓ రేషన్ డీలర్‌ను ఆర్డీవో సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎస్.కోట మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు బోనీ మనోజ్‌కుమార్, బుత్తల కృష్ణతో పాటు రేషన్ డీలర్ రవ్వ రాజు పాల్గొన్నారు. వీరిని గుర్తించిన కొందరు స్థానికులు ఫొటోలు తీసి ఎన్నికల అధికారులకు పంపారు. పరిశీలించి ఆరా తీసిన కలెక్టర్ నాగలక్ష్మి వాస్తవమేనని నిర్ధారణకు వచ్చి వలంటీర్లను తొలగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని మండల పరిషత్ కార్యాలయానికి వెంటనే పంపారు. ఈ విషయమై ఎంపీడీవో సాంబశివరావు మాట్లాడుతూ గ్రామంలో వలంటీర్లు నేరుగా ప్రచారంలో పాల్గొన్న ఫొటోలు, సమయం, ప్రదేశం వంటి ఖచ్చితమైన వివరాలు కలెక్టర్‌కు అందాయని, వెంటనే తొలగిస్తూ ఉత్వర్వులు పంపారని తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే వెంటే ఉన్న గ్రామ రేషన్‌డీలర్ రవ్వ రాజును ఆర్డీవో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రచారంలో డీలర్ ఉన్న ఫొటోలను కూడా స్థానికులు ఎన్నికల అధికారులకు పంపారు. వాటిపై తహసీల్దార్‌తో విచారించి నిజమని నిర్ధారించుకున్నాక డీలర్‌ను సస్పెండ్ చేసి ఆ డిపో బాధ్యతలను గ్రామానికి చెందిన మరో డీలర్ బీల నర్సింహనాయుడుకు అప్పగించారు. ఈ ఘటనతో మండలం లోని వలంటీర్లు, అధికారులు, ఎన్నికల సిబ్బంది షాక్ అయ్యారు. కలెక్టర్ కూడా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి నిబంధనల అమలు పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వైసీపీ నేతలపై కేసు

రేగిడి : ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై ఎంపీడీవో శ్యామలాకుమారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎంపీ, రాజాం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి, రాజాం నియోజకవర్గ పరిశీలకునిపై గురువారం కేసు నమోదైనట్లు సమాచారం. రేగిడి మండలం జోడుబందల, కందిశ, తునివాడలో ఎంపీతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి, పరిశీలకుని ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా చేపట్టడంతో కోడ్‌ను ఉల్లంఘించారని ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయం రాజాం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోషఫ్ వద్ద ప్రస్తావించగా సమాచారం తెలిసిందని, రాతపూర్వకంగా రావాల్సి ఉందని చెప్పారు.





ఎన్నికల సమావేశంలో నలుగురు వలంటీర్లు

విజయనగరం రూరల్ : విజయనగరంలోని 16వ డివిజన్‌లో స్థానిక వైసీపీ కార్పొరేటర్ నారాయణరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంతో పాటు ఎన్నికల కార్యాలయ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి హాజరయ్యారు. వైసీపీ జోనల్ నాయకులు పాల్గొన్నారు. అదే డివిజన్‌కి చెందిన వలంటీర్లు కూడా ఈ సమావేశంలో కూర్చోవడం గమనార్హం. సమావేశంలో కార్పొరేటర్ నారాయణరావుతో కలిసి వలంటీర్లు గురజాపు శేఖర్, గంగి మురళీ, కుప్ప గురుమూర్తి, రాజు పాల్గొన్నారు. ఆ వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నగర అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఇదే ఫిర్యాదును రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈ-మెయిల్‌లో పంపించారు.

ఏసీబీ వలలో డీటీ

- బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే అవినీతి ఆరోపణలు
- రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన శ్రీనివాసరావు

విజయనగరం క్రైం, మార్చి 21: సర్వే నెంబరు ఎండార్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసిన వారిని లంచం అడిగిన విజయనగరం డీటీ కొట్నాన శ్రీనివాసరావు ఏసీబీకి పట్టుబడ్డారు. రూ.10వేలు తీసుకుంటుండగా గురువారం కార్యాలయంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ సిబ్బంది గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చిన కొద్దిరోజుల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శ్రీనివాసరావు కొన్ని భూ వ్యవహారాల్లో కూడా తలదూర్చారన్న ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే..

నెల్లిమర్ల సీఎస్‌డీటీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొట్నాన శ్రీనివాసరావు కొద్దిరోజుల కిందట ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయనగరం తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ డీటీగా బాధ్యతలు చూసిన కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈయన స్థానంలో శ్రీనివాసరావు చేరారు. వాస్తవానికి శ్రీకాకుళం జిల్లా నుంచి ఇక్కడకు డీటీ రావాల్సి ఉందని, రాజకీయ పలుకుబడితో శ్రీనివాసరావు వచ్చారని పలువురు చెబుతున్నారు. విజయనగరం వచ్చింది మొదలు భూ అక్రమ వ్యవహారాల్లో తలదూర్చారని, 22ఏలో వున్న భూమి విషయంలో కూడా జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టుబడ్డారిలా..

విజయనగరం నోబుల్‌నగర్‌కు చెందిన జె.శివరామప్రసాద్, వి.మురళీమోహన్ స్వయానా బావబామ్మర్దులు. వీరికి 150 గజాలు, 267 గజాల నివాస స్థలాలు ఉన్నాయి. వాటి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించగా దస్తావేజుల్లోని సర్వే నెంబర్లలో సబ్ డివిజన్ మారిందని, తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్వే నెంబరు ఎండార్స్‌మెంట్ తీసుకువస్తే రిజిస్ట్రేషన్ అవుతుందని చెప్పారు. దీంతో గత నెల 26వ తేదీన తహసీల్దారు కార్యాలయంలో సర్వే నెంబరు ఎండార్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకుని సర్వేయర్‌ని కలిశారు. సర్వేయర్ పరిశీలించి ఫైల్‌ను డీటీకి పంపించారు. అనంతరం బాధితులు డీటీ శ్రీనివాసరావుని కలవగా ఎండార్స్‌మెంట్ ఇచ్చేందుకు లంచం అడిగారు. రూ.15 వేలు డిమాండ్ చేయగా రూ.10వేలకు అంగీకరించారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని శివరామప్రసాద్ ఈ నెల 19న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అనంతరం ఏసీబీ అధికారుల సూచనతో గురువారం మధ్యాహ్నం డీటీని కలిసి లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసరావు, జీఏపీ రమణలు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రామచంద్రరావు తెలిపారు.



కొట్నాన శ్రీనివాసరావు

కోడ్ ఉల్లంఘిస్తే కేసులు

కలెక్టర్ నాగలక్ష్మి



కలెక్టరేట్, మార్చి 21: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. కోడ్ ఉల్లంఘనపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులు, ఎంసిసి బృందాలు, ఇతర ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ దీపిక కూడా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 72 గంటల గడువు దాటిపోయిందని, నిబంధనలు అమలు చేయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కోడ్ అమలు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడ్ ఉల్లంఘనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సువిధ యాప్ ద్వారా మాత్రమే అనుమతులు జారీ చేస్తామన్నారు. సింగిల్ విండో విధానంలో ఆర్‌వోలు అనుమతులు జారీ చేస్తారని, అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సుమారు 19 రకాల అనుమతులు ఇస్తారని వివరించారు. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచారం, వాహనాలు తదితర అన్నింటికీ అనుమతులు అవసరమని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ ఎంసిసికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారించాలన్నారు. ఏ మాత్రం ఉల్లంఘన జరిగినా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్‌వో అనిత తదితరులు ఉన్నారు.

అందరి చూపు ఆ నాలుగింటి వైపు

- టీడీపీ అభ్యర్థులు ఎవరన్నదానిపై ఉత్కంఠ
- కూటమిలోని బీజేపీ అభ్యర్థులపైనా చర్చ



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. ఇంకా నాలుగు స్థానాల్లో కూటమి నుంచి పోటీ చేసేవారెవరో తేలకపోవడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. స్పష్టత వస్తే మరింతగా దూసుకెళ్లాలని అభ్యర్థులు భావిస్తున్నారు. త్రిముఖ పొత్తు కావటంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధినేతలు అభ్యర్థుల కూర్పు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రకటనకు ముందు మరింత లోతుగా ఆలోచిస్తున్నారు.

అధికార వైసీపీ తమ అభ్యర్థులను ఇటీవల ప్రకటించింది. వీరిని ధీటుగా ఎదుర్కొని విజయం సొంతం చేసుకోగలిగే అభ్యర్థుల కోసం మూడు పార్టీలు సుదీర్ఘ మథనం సాగిస్తున్నాయి. టీడీపీ ఇప్పటికే విజయనగరం నుంచి అదితి గజపతిరాజు, గజపతినగరం నుంచి కొండపల్లి శ్రీనివాసరావు, బొబ్బిలి నుంచి బేబీనాయన, రాజాం నుంచి మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌లను ఎంపిక చేసింది. పొత్తులో భాగంగా నెల్లిమర్ల సీటుకు లోకం నాగమాధవిని జనసేన ఎంపిక చేసింది. మిగిలిన ఎస్.కోట, చీపురుపల్లి, విజయనగరం ఎంపీ, ఇదే పార్లమెంట్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లపై ఉత్కంఠ కొనసాగుతోంది. చీపురుపల్లి నియోజకవర్గంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే అక్కడ వైసీపీ అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ పోటీలో ఉన్నారు. బొత్సకు దీటైన అభ్యర్థిని బరిలోకి దింపాలన్న భావనతో గంటా శ్రీనివాసరావును బరిలోకి దింపా లన్న ఆలోచనలో టీడీపీ అధినేత ఉన్నట్లు తెలుస్తోంది. గంటా మాత్రం భీమిలి టిక్కెట్ అడుగుతున్నారు. దీంతో ఎటూ తేల్చలేని పరిస్థితిలో అధిష్ఠానం ఉంది. ఇదిలా ఉండగా ఎస్.కోట నియోజకవర్గంలో టీడీపీ సీటు కోసం ఇద్దరు పోటీ పడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారితో పాటు ఎన్‌ఆర్‌ఐ గొంప కృష్ణ టికెట్ ఆశిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను సైతం ఎవరికి వారు నిర్వహిస్తున్నారు. టిక్కెట్టు తమకే అంటే తమకేనని వారి అనుచర గణం ప్రచారం చేస్తోంది. ఈ నియోజకవర్గం విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉంది. దీంతో పార్లమెంట్ అభ్యర్థి అభిప్రాయాన్ని కూడా అధిష్ఠానం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఓ నిర్ణయానికి రాలేకపోతున్నట్లు సమాచారం.

అలాగే విజయనగరం పార్లమెంట్ పరిధిలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం ఉంది. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు పోటీ చేశారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. అయితే కళావెంకటరావును పార్లమెంట్‌కు పంపాలా... లేక అసెంబ్లీ బరిలో దింపాలా అన్నది తేల్చలేకపోతున్నట్లు సమాచారం. అదే సమయంలో కూటమిలో భాగంగా బీజేపీ కూడా ఎచ్చెర్ల సీటు అడుగుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి ఇస్తే ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎన్ఈఆర్ పోటీ చేస్తారంటున్నారు. అలా అయితే కళా పార్లమెంట్‌కు వెళ్లవచ్చు. కళావెంకట్రావు అసెంబ్లీ సీటు కోసమే పట్టు బడుతున్నట్లు తెలుస్తోంది. ఇక విజయనగరం లోక్‌సభ టిక్కెట్టు కూడా కూటమిలో భాగంగా బీజేపీకి కేటాయించినట్లు ప్రకటించారు అయితే ఈ సీటును మార్చాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. కాగా పార్లమెంట్ సీటు విషయంలో బీజేపీ నుంచి కూడా పోటీ నెలకొంది. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి విశ్వనాధరాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌లు పోటీ పడుతున్నారు. ఏదేమైనా కూటమి అభ్యర్థుల విషయం ఒకటిరెండు రోజుల్లో తేలిపోవచ్చునని అంటున్నారు.

ఆ ఖాళీ పట్టాలు ఎవరెవరికో!

- తహసీల్దారు కార్యాలయాల్లో ఉంచిన వైనం
- గుట్టుగా అనుచరుల పేర్ల నమోదు
- ఈ వ్యవహారంలో కీలక నేతల నిమగ్నం
- ఎన్ని పట్టాలున్నదీ ఇప్పటికీ లెక్కలేదు
- స్వాధీనం చేసుకోని అధికారులు



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నాయకులు ఇళ్ల స్థలాలతో రాజకీయం మొదలెట్టారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే వరకు ఇళ్ల పట్టాల పంపిణీని చేపట్టారు. ఈ తంతు ఇప్పటికీ గుట్టుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అందుకోసం పేర్లు లేని ఖాళీ పట్టాలను వినియోగిస్తున్నట్లు భోగట్టా. కీలక నాయకులు రంగంలోకి దిగి నమ్మకమైన వ్యక్తులను పిలిపించి తాజాగా వారి పేర్లను పట్టాలపై నమోదు చేయించి.. చేతిలో పెడుతున్నట్లు తెలిసింది. ఇవి రిజిస్ట్రేషన్ కావాలంటే మళ్లీ మన ప్రభుత్వం రావాలని, ఆ మేరకు సహకారం అందించాలని చెబుతున్నట్లు సమాచారం.

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

విజయనగరం పట్టణంలోని 5నుంచి 7వ వార్డుల్లోని కొంతమందికి జమ్మునారాయణపురం ప్రాంతంలో గతేడాది డిసెంబరు 12న పట్టాలు పంపిణీ చేశారు. జమ్ము పరిధిలోని సర్వే నెంబరు 3, 4 పరిధిలో పట్టాలు ఇచ్చారు. ఇంకా కొన్ని స్థలాలు ఉన్నట్లు తెలుస్తోంది. చాలా లేఅవుట్లలో మిగులు స్థలాలు ఉన్నాయి. విజయనగరం పట్టణ పేద ప్రజల కోసం కేటాయించిన గుంకలాం లేఅవుట్లోనూ చాలా మిగులు స్థలం ఉంది. వీటిని రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా మలుచు కుంటున్నారు. నచ్చిన వారికి తరువాత రోజుల్లో పట్టాలు ఇస్తూ వస్తున్నారు. ఈ తంతు ఇప్పటికీ గుట్టుగా జరుగుతోంది. ప్రతి నియోజవర్గంలోనూ ఆయా గ్రామాల్లో మిగులు స్థలాలపై ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టారు. ఓట్ల రాజకీయానికి తెర లేపారు. తమకు నచ్చిన వారికి పంపిణీ చేసే పనిలో పడ్డారు. జగన్ ఫొటోతో ఉన్న ఖాళీ పట్టాలు ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్నాయి. అప్పట్లో లబ్ధిదార్ల పేరున పంపిణీ చేయగా ఇంకా ఖాళీగా ఉన్న పట్టాలకు లెక్కే లేదు. ఎన్నికల దగ్గరపడిన నేపథ్యంలో అనేక నియోజకవర్గాల్లో ఇళ్ల పట్టాల రాజకీయాలు నడుస్తూ ఉన్నాయి. తాజాగా అందిస్తున్న పట్టాలపై తేదీ కాని, తహసీల్దార్ సంతకం కూడా ఉండడం లేదు. వాటిని అందజేస్తూ మళ్లీ మన ప్రభుత్వం వస్తేనే పట్టా ఉంటుందని, లేకుంటే కష్టమని చెబుతున్నారు. ఇలా అధికార పార్టీ ఓటు బ్యాంక్ కోసం అన్ని మార్గాల్లోనూ ప్రయత్నిస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో తహసీల్దార్ల వద్ద ఖాళీగా ఉన్న జగనన్న ఇళ్ల పట్టాలను స్వాధీనం చేసుకోవాలి. తీసుకోకపోవడంతో అధికార పార్టీకి ఓటు అస్త్రాలుగా ఉపయోగపడుతున్నాయని సమాచారం. పెద్ద ఎత్తున దుర్వినియోగం అవుతున్నా కీలక ఎన్నికల అధికారులు దృష్టిపెట్టడం లేదు. తాము చెప్పినట్లు వినే తహసీల్దార్లను గతంలో ఎమ్మెల్యేలు నియమించుకున్నారు. ఎన్నికల కారణంగా కొత్త వారు వచ్చినా అధికార పార్టీ కనుసన్న ల్లోనే రెవెన్యూ యంత్రాంగం నడుస్తోందని ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

- తహసీల్దార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న జగన్న ఇళ్ల స్థలాల పట్టాలు దుర్వినియోగం అవుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి వద్ద ప్రస్తావించగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా అందరు తహసీల్దార్లకు ఇళ్ల పట్టాల విడుదలను నిలిపేయాలని ఆదేశించామన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమిని గెలిపించండి

బొబ్బిలి, మార్చి 21: రాష్ట్రాభివృద్ధికి కూటమి గెలుపు తప్పనిసరి అని బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఏడోవార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు-స్వప్న దంపతుల ఆధ్వర్యంలో ఇంటింటికీ బేబీనాయన వెళ్లి ఓటర్లను కలుసుకొని టీడీపీ కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులో ఆయనకు ఘనస్వాగతం లభించింది. మహిళలు హారతులు ఇచ్చి, నుదుట కుంకుమదిద్ది ఆశీర్వదించారు. ఈ ప్రచారంలో బేబీనాయన వెంట జనసేన నేతలు పాలూరు బాబు, సంచాన గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సజ్జా వెంకటరావు, తెలుగు మహిళా నాయకురాళ్లు బర్లి శ్రీదేవి, వెలగాడ షైమావతి, బీసపు పార్వతి, కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, సుంకరి సాయిరమేష్, బొద్దాన అప్పారావు, పర్లాపు చంద్రశేఖర్, కేతిరెడ్డి చంద్రశేఖర్, సాలా రమేష్, తెర్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురువారం ఓ రజకుని ఇంటి వద్ద బట్టలు ఇస్త్రీ చేసి అందరినీ ఆకట్టుకున్నారు.


బొబ్బిలిలో ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బేబీనాయన

సూపర్ సిక్స్ పథకాలను వివరించాలి

విజయనగరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ అర్బన్ అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు తరుపున నగరంలోని నాలుగో డివిజన్‌లో గురువారం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకువెళ్లే సమర్థ నాయకుడు చంద్రబాబేనన్నారు. టీడీపీ నా యకులు రఘు మండ శంకరరావు, ఖండవిల్లి బాబీ, జన్యాల వెంకటరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న ప్రసాదుల ప్రసాద్

విజయనగరంలో 'జయహో ఎస్సీ'

విజయనగరం రూరల్: నగరంలోని 47వ డివిజన్ పరిధిలోని కాంబోయి వీధిలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న అదితి గజపతిరాజుని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ హయాంలో జరిగిన కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాన్ని మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్, షైలిపల్లి పైడిరాజు ఆవిష్కరించారు.


పోస్టర్లు ప్రదర్శిస్తున్న టీడీపీ ఎస్సీసెల్ నాయకులు


ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

జన్నివలసలో 'బాబు ష్యూరిటీ..'

తెర్లాం: మండలంలో జన్నివలసలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బోడెల సింహాచలం అధ్యక్షతన ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేశారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని వారు అన్నారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. అందుచేత ఇక్కడ మన ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయనకు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మరడాన రమేష్, కర్రి సత్యనారాయణ, వెంకటరావు, కర్రి సత్యం, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బొండపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్


ఎంపీటీసీ చిరంజీవికి టీడీపీ కండువా వేస్తున్న కోండ్రు

ఐక్యతతో విజయం సాధిద్దాం

● జిల్లా వ్యాప్తంగా టీడీపీలోకి పలువురు చేరిక

బొండపల్లి (గజపతినగరం): గంగ చోళ్లపెంట గ్రామంలో గురువారం టీడీపీ గజపతినగరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు అట్టాడ లక్ష్మంనాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని, మాట్లాడారు. ఐక్యతతో విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. కొనిస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మడక కన్నబాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు వంద కుటుంబాలు శ్రీనివాస్ సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ సభ్యులు వేపాడ చిరంజీవులు, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, గజపతినగరం నియోజకవర్గ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఈశ్వరరావు, టీడీపీ సమన్వయకర్త సురేంద్ర, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ గ్రామ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, స్థానిక పంచాయతీల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని అంతికాపల్లి, ఒమ్మి రేగిడి మండలం రెడ్డిపేట గ్రామాలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్, అంతికాపల్లి మాజీ ఎంపీటీసీ సామంతుల చిరంజీవి.. వారికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. టీడీపీలో చేరిన వారిలో అలజింగి దయా, పాండ్రంకి నరేష్, నాగేశ్వరరావు, వెంకట్ విశ్వనాథం, అప్పారావు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుమల వెంకట మన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, నాయకులు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, మజ్జి శ్రీను, వావిలపల్లి క్రాంతి, నాగళ్ళ అప్పలనాయుడు, కెల్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

● బొబ్బిలి: బొబ్బిలి మండలం కారాడ గ్రామ సర్పంచ్ తెర్లి శేఖర్‌తో పాటు గ్రామానికి చెందిన సుమారు 25 కుటుంబాల వారు గురువారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన సమక్షంలో వారంతా పార్టీలో చేరడంతో కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు ఊద పార్వతి, యడ్ల గంగులు, యందవ చిన్నప్పమ్మ, ఇట్రంజి రామలక్ష్మి, కొర్లాపు లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా తొలుత గ్రామస్తులు బేబీనాయనను చాలా కోలాహలంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బేబీనాయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి గాలి వీస్తోందన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ కూడా కూటమికి మద్దతు పలకడం ఎంతో శుభపరిణామమన్నారు. టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

రాజాం: నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి తన గెలుపునకు తోడ్పాటును అందించాలని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, సమల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, కిమిడి అశోక్‌కుమార్, పిన్నింటి మోహన్‌రావు, దూబ ధర్మారావు, నాగళ్ల అప్పలనాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

రామభద్రపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కరణం విజయభాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబునాయుడు సేవలు రాష్ట్రానికి అవసరమని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపొందడం చారిత్రక అవసరమని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలంతా విజ్ఞతతో తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

ఉల్లంఘిస్తే చర్యలు

లక్కవరపుకోట, మార్చి 21: ఎన్నికల కోడ్ ఉల్లంగించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. బీఎల్‌వోలంతా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అదే విధంగా మేజర్ పంచాయతీ ఈవో ప్రసాద్ గురువారం వాలంటీర్లను పిలిపించి ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ఏ ఒక్క వాలంటీరు ఎన్నికల ర్యాలీలోగానీ, సభలు, సమావేశాల్లో గానీ పాల్గొనరాదని తెలిపారు. గీత దాటితే వేటు తప్పదని హెచ్చరించారు. అదే విధంగా ఏపీఎం అప్పలనాయుడు తమ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. గ్రామాల్లో మహిళలతో, గ్రూపు సభ్యులతో సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలన్నారు.

నిబంధనలు పాటించండి


సిబ్బందితో సమీక్షిస్తున్న ఆంజనేయులు

బాడంగి, మార్చి 21: గ్రామాల్లో విధిగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు చేయాలని మండల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లీడర్ ఆంజనేయులు అన్నారు. గురువారం రేజేరు, వాడాడ, కోటిపల్లి, గూడెపువలస సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, మహిళా పోలీసులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఇళ్లపై ఉంటే తక్షణమే తొలగించాలని, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా పనిచేస్తే చర్యలకు వెనుకాడేది లేదన్నారు.


పాఠశాల పరిశీలన

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో బాలభాస్కరరావు అన్నారు. జాకేరు, కరకవలస, చాలమలాపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఎండీఎంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కరకవలస పాఠశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంట సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవో

వైభవంగా మహాసామ్రాజ్య పట్టాభిషేకం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మార్చి 21: నగరంలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారులు పరమహంస పరివ్రాజకులు, అహోబిల రామానుజ చినజీయర్ స్వామి (హైదరాబాద్) వారిచే రామాయణ అనుగ్రహం అనే కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రామాయణంలోని మహాసామ్రాజ్య పట్టాభిషేకం ఘట్టాన్ని ఆయన భక్తులకు వివరించారు. ప్రవచనాలను భక్తుల కళ్లకు కట్టినట్లు వివరించారు.



హాజరైన భక్తులు, మాట్లాడుతున్న అహోబిల చినజీయర్ స్వామి

మహిళా సంఘాలతో సమావేశం

విజయనగరం రూరల్: నగరంలోని 30, 31 డివిజన్లలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహిళా విభాగం నాయకులు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగం తదితరులు టీడీపీ హయాంలో మహిళా సంక్షేమం, డ్వాక్రా గ్రూప్‌ల అభివృద్ధి తదితర విషయాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగుల రమేష్, బెవర భరత్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన డ్వాక్రా గ్రూప్ మహిళా సభ్యులతో మాట్లాడుతున్న అనురాధ బేగం

అదితికి మద్దతుగా ప్రచారం

విజయనగరం రూరల్: టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు గురువారం బాబామెట్టలోని 3, 4, 5 లైన్లలోని బ్రాహ్మణులను కలిసి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజును సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయకులు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో సామగ్రి వేలం

విజయనగరం రూరల్: పైడితల్లమ్మ ఆలయానికి సంబంధించి చదురు, వనం గుడిలో కొబ్బరి ముక్కలు, చీరలు, జాకెట్లు, తలనీలాలు, అదే విధంగా పైడిమాంబ దత్తత ఆలయమైన వేంకటేశ్వరామి ఆలయంలో కొబ్బరి ముక్కలు, ఇతరత్ర సామగ్రికి గురువారం వేలం పాట నిర్వహించారు. 2024 మార్చి నుంచి 2025 మధ్య కాలానికి సంబంధించి స్థానిక శివాలయంవీధిలో ఉన్న పైడితల్లమ్మ కల్యాణ మండపంలో ఈ కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, దేవదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


వేలం పాటలో అధికారులు, వేలం కాంట్రాక్టర్లు

24న శిష్టకరణాల వివాహ పరిచయ వేదిక

దాసన్నపేట: నగరంలోని గుంటురువారి వీధిలోని బృందావన్ అపార్టుమెంట్‌లో ఈ నెల 24న జిల్లా శిష్టకరణాల సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.పీ గౌరీశ్వరావు, నగర శాఖ అధ్యక్షుడు కె.ఎం సంజీవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక వన సమారాధన కార్యక్రమంలో సేకరించిన వధూవరుల వివరాల పుస్తకాన్ని ఈ పరిచయ వేదిక కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని పట్టణ, మండలాలు, గ్రామాల్లో ఉన్న శిష్టకరణాల కుటుంబసభ్యులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించాలి

బొబ్బిలి: పట్టణంలో గల ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, మురుగును తక్షణం తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి శానిటరీ అధికారులను ఆదేశించారు. గురువారం నాయుడు కాలనీ, మిలటరీ కాలనీ, ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాంతాలలో ఆమె పర్యటించారు. నాయుడు కాలనీలో కల్వర్టుల సమస్య ఉందని, ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయించాలని న్యాయవాది పోల అరుణ్ కుమార్ ఆమె దృష్టికి తీసుకొచ్చారు. నిధుల లభ్యతను బట్టి కల్వర్టులను మంజూరు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.


వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నివాళులు

జామి: మండల కేంద్రమైన జామిలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి, మాజీ రాష్ట్ర కార్యదర్శి శేషగిరి జయంతి లను మండల శాఖ నిర్వహించింది. వారికి నివాళులు అర్పించింది. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వరరావు, రాజారావు, కొల్లి సూర్యనారాయణ, జి.ప్రసాద్, జనార్దన్, ముత్యాలు, రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సభలకు అనుమతి తప్పనిసరి

రామభద్రపురం: గ్రామాల్లో రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సచివాలయ డీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, సభలు చేయకూడదని అన్నారు. ఇళ్లపై జెండాలు ఉండకూడదని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

సింగిల్ విండోలో 19 రకాల అనుమతులు

● ఆర్డీవో సాయిశ్రీ

బొబ్బిలి: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని బొబ్బిలి ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి ఆదిమూలం సాయిశ్రీ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో పద్ధతిలో 19 రకాల అనుమతులను మంజూరు చేస్తామన్నారు. ఇంటింటి ప్రచారం చేయాలనుకున్నా అనుమతి తప్పనిసరి అన్నారు. సువిధ యాప్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకుంటే అన్ని శాఖల నోడల్ అధికారులు అనుమతి ఇస్తారని ఆమె తెలిపారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు సంబంధించి ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదులు కంట్రోలు రూము నెంబర్ 08944 255888కు తెలియజేయాలన్నారు. మద్యం, డబ్బు, కానుకల పంపిణీని అడ్డుకుంటామన్నారు. వచ్చే నెల 15 వరకు కొత్తగా ఓటర్ల పేర్లను చేర్చుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దీనిని అందరూ వినియోగించుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీ సూచించారు.

బొబ్బిలి: స్థానిక తహ సీల్దారు కార్యాలయంలో గురువారం సాయంత్రం సెక్టారు అధికారులు, పోలీసు అధికారులతో ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్ల స్థితిగతులు, సమస్యాత్మక ప్రాంతాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిపై ఆమె సమీక్షించారు. అంతకుముందు ఉదయం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, డిప్యూటీ తహశీల్దారు రెడ్డి సాయికృష్ణ, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ప్రతినిధులు గంటి గోపాలకృష్ణశర్మ, పక్కి చంద్రమౌళి, ముప్వల శ్రీనివాసరావు, సెక్టారు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

బొబ్బిలి: రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు (ఆర్‌పీఎస్ఎఫ్), సివిల్ పోలీసులు సంయుక్తంగా బొబ్బిలిలో కవాతు నిర్వహించారు.


బొబ్బిలి నాయుడుకాలనీలో..

జామి: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ హెచ్ ఉపేంద్ర ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. గురువారం జామి, జాగరం, చింతాడ, పావాడలో కవాతు సాగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సాయుధబలగాల సంఖ్య ఎన్నికల సంఘం పెంచడంతోపాటు వారికి వెపన్స్ ఇచ్చిందని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరు విఘాతం కల్పించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కవాతులో ఎస్ఐ వీరబాబు తదితరులు ఉన్నారు.


జామి మండలం చింతాడలో..

తెర్లాం: మండల పరిధిలో ఉద్దవోలులో సీఐ తిరుమల రావు, ఎస్.ఐ రమేష్ అధ్యక్షతన ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ప్రశాంతంగా ఓటు వేయాలని, సమస్యాత్మక వ్యక్తు లు ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ ప్రసాద్, దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్ల ట్యాంకులో పడి బాలుడి మృతి

భోగాపురం, మార్చి 21: నీళ్ల ట్యాంకులో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. బొబ్బిలి కొత్తఎరుకుల వీధికి చెందిన దాసరి సుధా, దాసరి నరిశింగరావు దంపతులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి శిరీషా, సిద్ధూ(7) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరంతా కూలి పనుల నిమిత్తం ఈనెల 18న దిబ్బలపాలెంలోని ఓ రిసార్ట్‌లో చేరారు. వీరికి నిర్వాహకులు రిసార్టు ఆవరణలోనే నివాసం ఉండేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే గురువారం ఉదయం దంపతులిద్దరూ పనులకు వెళ్లిపోవడంతో పిల్లలిద్దరూ తోటి పిల్లలతో కలిసి రిసార్ట్ ఆవరణలోనే ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో వీరి కుమారుడు దాసరి సిద్ధూ సమీపంలో వాడుక కోసం ఏర్పాటు చేసిన నీళ్ల ట్యాంకులో పడిపోయాడు. దీంతో తోటి చిన్నారులు కేకలు వేశారు. వెంటనే కుటుంబ సభ్యులు, సెక్యూరిటీ గార్డు వచ్చి బాలుడిని ట్యాంకులో నుంచి బయటకి తీసి హుటాహుటీన స్థానిక సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై బాలుడు తండ్రి నరిసింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

● అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు

భామిని: మండలంలోని బురుజోల గ్రామానికి చెందిన ఊయక మణికంఠ (24) బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందడంతో అవయవదానానికి కుటుంబసభ్యులు ముందుకొచ్చారు. కుటుంబ సభ్యులు, కొత్తూరు పోలీసుల కథనం మేరకు.. కొత్తూరు మండలం మాసంగి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మణికంఠ గాయపడ్డాడు. తలకు తీవ్రగాయాలుకావడంతో బ్రెయిన్ పని చేయక మృతిచెందాడు. మణికంఠ శరీర భాగాలు ఉపయోగపడతాయని జెమ్స్ ఆసుపత్రి వైద్యాధికారులు కుటుంబ సభ్యులకు సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు.దీంతో ఏ అవయవాలు పనికొచ్చినా తీస్తామని వారి వద్ద నుంచి అంగీకారపత్రం తీసుకున్నారు. ఊపిరితిత్తులు, కళ్లు సేకరించారు. ఊపిరితిత్తులు హైదరాబాద్‌కు పంపించగా, కళ్లు రెడ్‌క్రాస్ తరలించారు. మణికంఠకు అన్న, వదినతో పాటు అక్కలు గిరిజ, ఉమ, బావలు ఫల్గుణరావు, చందు ఉన్నారు. అవయవదానం చేయడంతో మణికంఠ సజీవంగానే ఉన్నట్లు అయిందని పలువురు కుటుంబ సభ్యులను అభినందిస్తున్నారు. అవయవదానంపై జెమ్స్ వైద్యులు ధ్రువపత్రాలు అందజేస్తారని, దీంతో వైద్యపరంగా ఎటువంటి సహకారమైనా దొరుకుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తూరు పరిధిలో ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మణికంఠ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: ఉంగరాడమెట్ట సెంటర్ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న అంబఖండి గ్రామానికి ఒక వ్యక్తిని పట్టుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

బంగారం షాపులపై దుష్ప్రచారం తగదు

● బొబ్బిలి గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్

బొబ్బిలి, మార్చి 21: బొబ్బిలి పట్టణంలో గల బంగారం షాపులపై ఎటువంటి ఆధారాలు లేకుండా దుష్ప్రచారం చేయడం తగదని బొబ్బిలి గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్-స్వర్ణకారుల సంఘం ప్రతినిధులు అన్నారు. గురువారం సాయంత్రం సంఘనాయకులు పూసర్ల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ప్రతి బంగారు ఆభరణం హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్‌తో అమ్మకాలు చేస్తున్నామన్నారు. బీఐఎస్ అప్రూవ్ చేసిన కేంద్రాలు ఓ కోడ్‌ను ముద్రిస్తాయని, ఆ కోడ్‌ను మొబైల్‌లోని బీఐఎస్ కేర్ యాప్‌లో ఎంటర్ చేస్తే ఆ నగలు ఎప్పుడు కొనుగోలు చేశారు? దాని నాణ్యత, షాపు వివరాలు వస్తాయన్నారు. ఈ నూతన విధానంలో అత్యంత పారదర్శకత ఉంటుందన్నారు. వీటిపై సోషల్ మీడియాలో ఇతర మాధ్యమాల్లో ఆధారాలు లేని వార్తలు ప్రచురించవద్దని, వినియోగదారుల్లో అనుమానాలు రేకెత్తించవద్దని హితవు పలికారు.

సీతారాములకు బేబీనాయన పూజలు

తెర్లాం: నందిగాంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బేబీనాయన హాజరయ్యారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.


పూజలు చేస్తున్న బేబీనాయన

గంగన్నపాడులో పరామర్శ

ఇటీవల గంగన్నపాడు మాజీ సర్పంచ్ గేదెల అచ్యుతరావు మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను గురువారం బేబీనాయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయుడు, నాయకులు కరణం రమేష్, పోలినాయుడు, జావాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

లక్కవరపుకోట (కొత్తవలస), మార్చి 21: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో గల తుమ్మికాపల్లి పంచాయతీ శివారు సీతంపేటలో గురువారం వైద్య సిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు ర్యాలీ చేపట్టారు. రెండు వారాలపాటుదగ్గు, జ్వరం, కఫం, ఆకలి మందగించి నీరసంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని హెల్త్ సూపర్‌వైజర్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీబీ నివారణ మనందరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ, కొత్తవలస టీబీ యూనిట్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సీతంపేటలో క్షయవ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

రాజాం: శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించిన జాతర సందర్భంగా అమ్మవారి హుండీలు, టికెట్లు, ప్రసాదాల ద్వారా రూ.19లక్షల 88వేల 712 రూపాయలు వచ్చినట్లు ఈవో బీవీ మాధవరావు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.67,554 పెరిగిందన్నారు. టికెట్ల అమ్మకాల ద్వారా రూ.7,07,160, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2లక్షల 83వేల 670, హుండీ ఆదాయం రూ.9లక్షల7వేల 706, విరాళాల ద్వారా రూ.87వేల176, అద్దాలు, భరిణల ద్వారా రూ.3వేలు వచ్చాయి. అయితే వర్షం కారణంగా భక్తుల తాకిడి తగ్గినప్పటికీ దేవదాయ శాఖ అధికారులు ఆదేశాల మేరకు ప్రసాదాల విక్రయం చేపట్టడంతో ఆదాయం గత ఏడాది కంటే పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌వో బీవీఎస్ఎస్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ, ఆలయ అనువంశక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, ఈవోలు పి.శ్యామలరావు, టి.శివకేశవరావు, సలాది తులసీదాస్, వెంపల లక్ష్మణరావు, దేవిరెడ్డి రామారావు పాల్గొన్నారు.

ఆశీలు వేలం పాట ఖరారు

రాజాం రూరల్: రాజాం మున్సిపాల్టీలో మార్కెట్, కబేళా వసూళ్లకు వేలంపాట టెండర్లు ఎట్టకేలకు గురువారం ఖరారయ్యాయి. మున్సిపాల్టీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన టంకాల దిలీప్‌కుమార్ రూ.29.91 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నారు. ఈ మొత్తానికి 18 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంది. ఐదుగురు టెండర్లు దాఖలు చేశారు. వీరిలో అధిక మొత్తానికి కోట్ చేసిన దిలీప్‌కుమార్ టెండర్ వివరాలను మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కౌన్సిల్‌కు పంపించారు. మున్సిపాల్టీ ప్రత్యేకాధికారి, ఆర్డీవో ఈ టెండర్‌ను ఖరారు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా గతేడాది రూ.34.50 లక్షలకు టెండర్ ఖరారు కాగా, ఈ ఏడాది వేలంపాటల్లో కాంట్రాక్టర్లు ఎవరూ పాల్గొనకపోవడం, హాజరైనవారు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావడం, వాటిని పరిష్కరించే అధికారం కమిషనర్‌కు లేకపోవడం వంటి కారణాలతో వేలంపాట ఏడుసార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు రహస్య టెండర్‌కు వెళ్లాల్సి వచ్చింది. రూ.29.91 లక్షలకు టెండర్ ఖరారైతే మున్సిపాల్టీ కొంతమేర ఆదాయాన్ని కోల్పోయినట్లవుతుంది.

ధాన్యం సొమ్ము ఇవ్వరూ..


నిరసన తెలుపుతున్న రంగారాయపురం రైతులు

లక్కవరపుకోట: రంగారాయపురం గ్రామానికి చెందిన సుమారు 20 మంది రైతుల ధాన్యం సొమ్ము ప్రభుత్వం విడుదల చేయలేదని వారు వాపోయారు. ఈ మేరకు గ్రామంలో గురువారం నిరసన తెలిపారు. సంక్రాంతికి ముందు ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చామని, నేటికీ ఒక్కపైసా రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలు గడుస్తున్నా పైసా కూడా రాలేదని రైతులు సీతారాం, అప్పారావు, వెంకటరమణ, నర్సింగరావు, శ్రీరామ్మూర్తి తదితరులు తెలిపారు. కలెక్టర్ స్పందించి వెంటనే రైతుల సొమ్ము ఇప్పించాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: గర్భిణులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రచారం చేయాలని రాజాం ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ తెలిపారు. గురువారం బూరాడ సెక్టారు పరిధిలోని ఉంగరాడమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టారు స్థాయి పోషణ పక్వాడ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజర్ నూకాలమ్మ, బీపీసీ ఎల్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు నష్టం


పుర్రేయవలసలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రామారావు

చీపురుపల్లి: ఇటీవల అకాల వర్షాలతో పాటు పెద్దఎత్తున వీచిన ఈదురు గాలులకు మండలంలో సుమారు 500 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు రామారావు తెలిపారు. పొట్ట దశలో మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. రావివలస, పుర్రేయవలస, విశ్వనాథపురం, రామలింగపురం తదితర ప్రాంతాల్లో పంటకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ గ్రామాల్లోని మొక్కజొన్న పంటలను ఆయన గురువారం సందర్శించారు. ఆయన వెంట ఏవో రఘునాథ్, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

శాటిలైట్ తయారీకి సాంకేతిక సహకారం అందిస్తా

నెల్లిమర్ల: శాటిలైట్ తయారీకి విద్యార్థులు ముందుకు వస్తే తన వంతు సాంకేతిక సహకారం అందిస్తానని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబోరేటరీకి చెందిన శాస్త్రవేత్త డా.కరణం దుర్గాప్రసాద్ భరోసా ఇచ్చారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మిషన్ టు ది మూన్ - సాంకేతిక, అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, ఉపన్యాసం చేశారు. ఫిజికల్ రీసెర్చ్ లేబోరేటరీలో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. అనంతరం ఆయనను వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ డీన్ ఏఎస్‌వీ రమణారావు, డీన్ సన్నిడీయోల్, ఎఫ్‌సీఈ విభాగం అధిపతి జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ దాడులు


కూరగాయల షాపును తనిఖీ చేస్తున్న దృశ్యం

రాజాం: లీగల్ మెట్రాలజీ విజయనగరం జోన్ అధికారులు డిప్యూటీ కంట్రోలర్ బి.మధు సూదన రెడ్డి ఆధ్వర్యంలో రాజాంలో గురువారం దాడులు నిర్వహించారు. కమీషన్ ఏజెంట్లు, రైతు బజార్లు, సంతలు, పండ్లు, కూరగాయలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ఇతర వ్యాపార సంస్థలపై ప్రత్యేక దాడులు నిర్వహించి 14 కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ కంట్రోలర్ పీవీ రంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు, ఎ.బలరాంకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి ధరణి

వేపాడ: క్షయ వ్యాధిపై ప్రజలకు ఆందోళన అవసరం లేదని, ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా చికిత్స పొందితే పూర్తిగా నయం చేసుకోవచ్చునని వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధరణి అన్నారు. వేపాడ శివారు బక్కునాయుడుపేట వద్దగల ఆదర్శ పాఠశాలలో గురువారం ఆమె విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాల పైబడి తగ్గని దగ్గు, దగ్గుతూ ఉంటే చాతిలో నొప్పి రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, కఫంలో రక్తం పడడం, వంటి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీలో కఫ పరీక్ష చేసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినా..

● పరిష్కారం కాని ముంజేరు మురుగునీటి సమస్య


ముంజేరు నుంచి సిద్ధార్థ కాలనీకి వెళ్లే దారిలో నిల్వ ఉన్న మురుగునీరు

భోగాపురం: ముంజేరు పంచాయతీలో ముంజేరు, సిద్ధార్థ కాలనీల మధ్య రహదారిపై ఏడాది కాలంగా మురుగు నిల్వ ఉంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. దీనిపై ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముంజేరు గ్రామంలో సిద్ధార్థ కాలనీకి వెళ్లే దారిలో సీసీ రహదారిపై ఏడాది కాలంగా మురుగు నిల్వఉంది. దీంతో అధికారులు ముంజేరు గ్రామ వాడుకనీరు సిద్ధార్థ కాలనీ పక్క నుంచి పోయేవిధంగా కాలువ నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించారు. అయితే గ్రామం నుంచి వచ్చే వాడుకనీరంతా సిద్ధార్థ కాలనీ మీదుగా వస్తే ఇబ్బంది అవుతుందని, గతంలో వలే ఆర్అండ్‌బీ రహదారి పక్క నుంచి కాలువ ఏర్పాటుచేసి, వాడుక నీరు పోయే విధంగా చూడాలని సిద్ధార్థ కాలనీకి చెందిన ప్రజలు.. ఆ పనులను అడ్డుకున్నారు. వీరికి అవగాహన కల్పించేందుకు జిల్లా అధికారులు అనేక మార్లు ప్రయత్నాలు చేసినా సమస్య కొలిక్కిరాలేదు. ఎప్పటిలాగే రహదారి మధ్యనే మురుగు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. రోగాల బారిన పడతామేమోనని ప్రజలు భయాందోళనచెందుతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 12న కలెక్టర్ నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ముంజేరు గ్రామానికి వచ్చారు. స్థానికులు ఈ మురుగు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి ఆమె హామీ ఇచ్చారు. కానీ నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో సమస్య పరిష్కరిస్తాం

కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి సుమారు ఐదు ప్రతిపాదనలు తయారు చేయాలని డీఈ, పంచాయతీరాజ్ ఇంజినీర్, వీఆర్వో, కార్యదర్శి, ఇంజినీరింగు అసిస్టెంట్లకు ఎంపీడీవో జి.చంద్రకళ సూచించారు. వీటి ఆధారంగా గ్రామ సభ నిర్వహించి, సమస్య పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకుంటారు. అందిరి సహకారంతో త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

- సురేష్, ఈవోపీఆర్డీవో

దౌడు అదరహో

● ఘనంగా తీర్థ మహోత్సవాలు
● అలరించిన ఎడ్లు, గుర్రపు పందాలు


వేపాడ: పరుగు పోటీలో దౌడు తీస్తున్న గుర్రం

వేపాడ: బానాది గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు ప్రజలను ఉర్రూతలూగించాయి. అనంతరం గ్రామ పెద్దల చేతులమీదుగా విజేతకుల నగదు బహుమతులు అందించారు. ఈ తీర్థంలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


లక్కవరపుకోట: తలారిలో దౌడు తీస్తున్న ఎడ్లు

లక్కవరపుకోట: కొట్యాడ తలారి గ్రామంలో అచ్చయ్యమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తీర్థంలో భాగంగా నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మధ్యలో ఒక బండి అదుపు తప్పి జనంలోకి దూసుకొచ్చింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కోటమ్మ సిరిమానుకు పూజలు


సిరిమానుకు పూజలు చేస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్: కొట్టాం కోటమ్మ జాతర సిరిమానుకు గురువారం పూజలు నిర్వహించారు. ఈ సిరిమాను చెట్టు లక్కవరపుకోట మండలం గోల్డాం గ్రామంలో లభించినట్టు ఆలయ ఈవో నాగేంద్ర తెలిపారు. ఈ చెట్టుకు ఆలయ చైర్మన్ రమణబాబు, పూజారి నాగభూషణం పూజలు చేశారు. అనంతరం కొట్టాం గ్రామానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో అమ్మవారి పండుగ నిర్వహించనున్నట్టు తెలిపారు.

కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

దత్తిరాజేరు: గజపతినగరం నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌పై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేసినట్టు బూర్జవలస పోలీస్‌స్టేషన్ ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ గురువారం తెలిపారు. ఈనెల 19వ తేదీన విజయరామాపురం గ్రామంలో రిటర్నింగ్ అధికారి అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారని, దీనిపై ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

రాజాం: వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనలు విధిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసఫ్ సూచించారు. పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసినా, మైకొసెట్ ద్వారా ప్రచారం నిర్వహించినా, ముందుగా దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి కార్యక్రమాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయంలో అన్ని పార్టీల నాయకులు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. దరఖాస్తు చేయడానికి అవసరమైన ఫారాలు స్థానిక ఎన్నికల డీటీ ప్రకాష్ వద్దనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, డీటీ ప్రకాష్, నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, పొగిరి మంగరాజు, మిత్తిరెడ్డి మదుసుధనరావు, వంజరాపు నర్సింహనాయుడు పాల్గొన్నారు.

కోడ్ అమలుపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంపీడీవో హరిహరరావు

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎన్నికల కోడ్ అమలుపై ఎంపీడీవో ఎస్.హరిహరరావు సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పక్కాగా ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి, రాజకీయ పార్టీ నాయకుల నుంచి ఎటువంటి పిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచారాలను పరిశీలించి, నిబంధనలు అతిక్రమిస్తే పిర్యాదు చేయాలని చెప్పారు. అనుమతులు లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు కడితే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ పి.హరి, ఈవోపీఆర్డీ సుగుణాకరరావు, డిజిటల్ సహాయకులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశీలన


పూతికపేటలో పర్యటిస్తున్న ఎంపీడీవో రామారావు

నెల్లిమర్ల: ఎన్నికల విధుల్లో భాగంగా ఎంపీడీవో జి.రామారావు మండలంలోని కొండగుంపాం, పూతికపేట, గరికిపేట, మొయిద విజయరాంపురం గ్రామాల్లో గురువారం పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అలాగే మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు తీరును పరిశీలించారు. స్థానిక వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సింహాద్రి, ఎంపీడీవో కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీఏఏ అమలును అడ్డుకోవాలి

● వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీల నాయకుల పిలుపు

పార్వతీపురం టౌన్: దేశాన్ని బలహీనపరిచే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుపరిచే బీజేపీ పన్నాగాన్ని అడ్డుకోవాలని వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో వామపక్ష, కాంగ్రెస్, ప్రజాతంత్ర శక్తుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీపీఎం, కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఆర్.వేణు, మోహనరావు, మన్మథరావు మాట్లాడుతూ దేశఐక్యతకు, లౌకిక, ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే విధంగా బీజేపీతెచ్చిన చట్టం ఉందన్నారు. సీఏఏ చట్టం దేశంలోని ముస్లిముల సమస్య కాదని, దేశాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరిచే విధంగా బీజేపీ దుష్టపన్నాగమని ఆరోపించారు. 2019లోనే పార్లమెంట్‌లో ఈ చట్టం తెస్తే వైసీపీతోపాటు అన్ని పార్టీలు బీజేపీ ముందు మోకరిల్లాయన్నారు. సీఏఏ అమలుకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నా మని తెలిపారు.

జ్యూట్ మిల్లులో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల: స్థానిక జ్యూట్ మిల్లులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ వైర్లపై చెట్లు పడ్డాయి. అలాగే మిల్లులో ఉన్న ట్రాన్స్‌ఫారం కాలిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు గురువారం మిల్లు మూసివేయగా, శుక్రవారం కూడా మూసివేస్తున్నట్టు యాజమాన్యం తెలియజేసింది.

రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

రాజాం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెం పేటలో కొత్తగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు రంప హనుమంతరావుశర్మ సారథ్యంలో పూజలు నిర్వహించారు. ఈనెల 24న ప్రతిష్ఠ జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించండి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

గరుగుబిల్లి: రక్తహీనత నివారణపై దృష్టి సారించాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం స్థానిక మండలాభివృద్ధి అధికారి కార్యాలయంలో గ్రామైక్య సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్త లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలు వల లోపంతో శిశు మరణాలు పెరుగుతున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలకు సంబంధించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాల శాతం నిరోధానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీల నుంచి పూర్తిస్థాయిలో పోషక సామగ్రి అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కేకే సాగర్‌వర్మ, డాక్టర్ కె.కార్తీక్, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

శిశు మరణాలను తగ్గించాలి


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: పీఆర్ఐఎస్ఎం కార్యక్రమం ద్వారా శిశు మరణాల సంఖ్యను తగ్గించాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో జి.సత్య నారాయణ, డాక్టర్ పాలవలస ఉమామహేశ్వరి, డాక్టర్ మానస, వివిధ శాఖల సిబ్బందితో సమీక్షించారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించి వారిని సచివాలయ సిబ్బంది, స్వయంసహాక సంఘాలు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు దత్తత తీసుకోవాలన్నారు. దత్తత తీసుకున్న వారిని ప్రతినెలా మూడుసార్లు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్య నారాయణ, డాక్టర్ పాలవలస ఉమామహేశ్వరి, డాక్టర్ మానస, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీళ్లు లేని తూనిక యంత్రాల గుర్తింపు

పాలకొండ: తూనిక యంత్రాలకు సీళ్లు లేకపోతే చర్యలు తప్పవని శ్రీకాకుళం తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు హెచ్చరించారు. గురువారం పాలకొండ పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీల్ లేని పది తూనిక యంత్రాలను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్ రాజారమేష్, పార్వతీపురం ఇన్‌స్పెక్టర్ రత్నరాజు, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.